సాక్షి
నిర్మల్
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా జట్టు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొంది.

భైంసా పట్టణంలో వృద్ధాశ్రమం

భైంసాటౌన్: భైంసా పట్టణానికి ప్రభుత్వం వృద్ధాశ్రమం మంజూరు చేసిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రూ.50 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వృద్ధాశ్రమం మంజూరు చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బోధన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సునీల్



బాధ్యతలు అప్పజెప్తున్న దేవేందర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఏర్పడిన బోధన ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరఆర్.సునీల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఇకపై దేవేందర్‌రెడ్డి జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులుగా కొనసాగనున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్.ప్రసాద్, బోధన ఆసుపత్రి ఆర్ఎంవో గణేశ్‌నాయక్, డిప్యూటీ వార్డెన్ కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

2న జిల్లాస్థాయి యోగా పోటీలు

భైంసాటౌన్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోస్లే బాజీరావు, ఉప్పు రవీందర్ తెలిపారు. కుంటాలలోని సృజన విద్యానిలయం పాఠశాలలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 96404 63434, 96404 71787 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. 45 ఏళ్లలోపువారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగంలో కూడా పోటీలు ఉంటాయని వెల్లడించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చినవారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు


- 20వ రోజుకు చేరిన సమ్మె



పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్ష శిబిరం వద్ద పొర్లుదండాలు పెట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. నిరసనలో శైలజ, దేవిక, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల మానవహారం




మానవహారం నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యల పరిష్కారం కోసం ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని లేని యెడల పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత, జిల్లా కోశాధికారి రామలక్ష్మి, రాధ, భార్గవి, సుధ, సంగీత, అనురాధ, మంగ, లక్ష్మి, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు డాక్టర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గైనకాలజిస్ట్(2), అనస్తీషియా(3), పీడియాట్రిస్ట్(1), సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్-4) పోస్టులను ఒప్పంద పద్ధతి (కాంట్రాక్ట్)లో నియమించుటకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు సమర్పించాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు.

అటు.. ఇటు..



- జిల్లాలో మూడు పార్టీల్లో చేరికల పర్వం..
- పోటాపోటీగా నేతలను చేర్చుకుంటూ..
- బలోపేతంపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ దృష్టి
- తమ భవిష్యత్తునూ చూసుకుంటూ..
- పార్టీ మారుతున్న ప్రజాప్రతినిధులు

నిర్మల్: జిల్లాలో మూడు ప్రధాన పార్టీల మధ్య పోటాపోటీగా చేరికల పర్వం కొనసాగుతోంది. నిన్నమొన్నటి వరకు వార్డు మెంబర్లు, సర్పంచులు, ఉపసర్పంచులను చేర్చుకున్నారు. ఇప్పుడు ఏకంగా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను టార్గెట్ చేసి తమ వైపు తిప్పుకుంటున్నారు. తాజాగా మామడ మండలం జెడ్పీటీసీ సోనియా, ఆమె భర్త, బీజేపీ నేత సంతోష్‌నాయక్ కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి గెలిచిన నిర్మల్ కౌన్సిలర్ ఇమ్రానుల్లా బీఆర్ఎస్‌కు దగ్గరయ్యారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన నిర్మల్ మున్సిపల్ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, పలువురు ఉపసర్పంచులు, వార్డుమెంబర్లు బీజేపీలో చేరగా, బీజేపీకి చెందిన పలువురు మండలస్థాయి నాయకులు కారెక్కారు. ఇలా ఒక పార్టీని మించి మరోపార్టీ బలోపేతం కోసం కీలకనేతలను, ప్రజాప్రతినిధులను తమవైపు తిప్పుకుంటున్నాయి.

కాంగ్రెస్‌కు కీలకం..

క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టు ఉండాలంటే స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధి లేదంటే అక్కడి కీలకనాయకుడు తమ పక్షంలో ఉండాలి. ఇప్పుడు ఇదే సిద్ధాంతాన్ని పార్టీలు ఫాలో అవుతున్నాయి. తమ పక్షంలో కీలకనేతలు, ప్రజాప్రతినిధులు లేకుంటే, ఎదుటి పార్టీ నుంచి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధానంగా హస్తం పార్టీ చేరికలను జోరుగా ప్రోత్సహిస్తోంది. గతంలో ఏఐసీసీ నేతగా ఉన్న మహేశ్వర్ రెడ్డి బీజేపీలో చేరడంతో చాలావరకు పార్టీ క్యాడర్ కూడా ఆయన వెంటే వెళ్లింది. చాలాచోట్ల పార్టీ నడిపేస్థాయి ఉన్న నేతలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈదశలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి డీసీసీ అధ్యక్షుడైన శ్రీహరిరావు పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టారు. ఈక్రమంలో ఆదివారం తన సొంత మండలమైన మామడ జెడ్పీటీసీ సభ్యురాలు సోనియా, సంతోష్‌నాయక్ దంపతులను పార్టీలో చేర్చుకున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన మరికొందరు ప్రజాప్రతినిధులు టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్‌నేతలు చెబుతున్నారు.

కారెక్కిస్తున్నారు..

అధికార బీఆర్ఎస్ వరుసగా మూడోసారి గెలిచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా, క్షేత్రస్థాయి నుంచి మరింత బలం పెంచుకునేలా చేరికలను ప్రోత్సహిస్తోంది. ఇటీవల బీజేపీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, ఆయనవర్గాన్ని మంత్రి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. అలాగే బీజేపీకే చెందిన బీసీనేత, రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, సోన్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌కూ గులాబీ కండువాలు వేశారు. నిర్మల్ మున్సిపల్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్‌గా ఉన్న ఇమ్రానుల్లా కూడా ఇటీవల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసివచ్చారు. మరికొందరు కాంగ్రెస్, బీజేపీ నేతలు కారెక్కేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న అసమ్మతివర్గం బుజ్జగింపులపైనే దృష్టిపెట్టగా, ఖానాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ అనుచరులను జాన్సన్ నాయక్ తనవైపు తిప్పుకుంటున్నారు.

ముందుచూపుతోనే..

బలోపేతంపై దృష్టిపెట్టి పార్టీలు చేరికలను ప్రోత్సహిస్తుండగా, భవిష్యత్తును ఆలోచించుకుని ప్రజాప్రతినిధులు, కీలక నేతలు పార్టీలు మారుతున్నారు. కాంగ్రెస్‌లో ఉంటే గెలుపు డౌటేనన్న ఆలోచనతో మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరారు. బీఆర్ఎస్‌లోనే ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉండదన్న ఆలోచనతో శ్రీహరిరావు కాంగ్రెస్‌లోకి మారారు. ఇక భవిష్యత్తుపై దూరదృష్టితో నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలాగే మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నేతలు ఆచితూచి పార్టీలను ఎంపిక చేసుకుంటున్నారు.

కమలానికి అవసరం..

జిల్లాపై గంపెడాశలు పెట్టుకున్న బీజేపీకి క్షేత్రస్థాయి నుంచి బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ఈదిశలోనే ప్రత్యర్థి పార్టీల్లోని బలమైన నేతలు, ప్రజాప్రతినిధులను తమవైపు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మహేశ్వర్ రెడ్డి క్రమంగా జిల్లాలో పట్టుసాధిస్తున్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో మూడుసార్లు గెలిచిన బీఆర్ఎస్ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్‌ను పార్టీలో చేర్చుకున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల బీరవెల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్‌లతోపాటు వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులను బీజేపీలో చేర్చుకున్నారు. ఇలా పలు కీలక గ్రామాలు, అధికారపార్టీ బలంగా ఉన్న చోట పట్టుసాధించే ప్రయత్నం చేస్తున్నారు. ముధోల్, ఖానాపూర్‌లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించకపోవడం, ఉన్న ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉండటంతో వారు పెద్దగా చేరికలపై దృష్టిపెట్టడం లేదు.

ఓటు వినియోగంపై పాట



ఆడియో పాట విడుదల చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఓటు వినియోగంపై అవగాహన కల్పించే పాటను సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల ఆధ్వర్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాంస్కృతిక కళాకారులతో ప్రత్యేక పాటను రూపొందించామని తెలిపారు. పాటను రాసి పాడిన ఎలిశెట్టి సుదర్శన్, సహకారం అందించిన కడారి రఘునాథ్, రికార్డింగ్ చేసిన చెనిగారపు నాగరాజును కలెక్టర్, డీపీఆర్వో అభినందించారు.

బాసర సందర్శనకు విద్యార్థులు



బాసరకు వెళ్తున్న విద్యార్థులతో కలెక్టర్

నిర్మల్ రూరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులు బాసర సందర్శన యాత్రకు శనివారం బయల్దేరారు. మినీ స్టేడియం నుంచి బయల్దేరిన స్కూల్ బస్‌ను కలెక్టర్ వరుణ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో 45 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాసర సరస్వతీదేవి ఆలయం, ట్రిపుల్ ఐటీని సందర్శించనున్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్‌వో వినోద్‌కుమార్, ఎస్ఆర్పీ నారాయణవర్మ, ప్రిన్సిపాల్ మోహన్, వినోద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనస్థాయి సర్వే..

- జిల్లా వ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు
- 'న్యాస్' కోసం సన్నద్ధంలో భాగంగానే...
- మొదలైన స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే..



విద్యార్థులకు సర్వే పరీక్షను నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ ఖిల్లా: విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరీక్షించేందుకు ఏటా జాతీయ స్థాయిలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కొనసాగుతోంది. ఈ సర్వేలో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలు వెనుకబడి ఉన్నట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర విద్యాశాఖ విద్యాసాధనలో వెనుకబాటును అధిగమించేందుకు శ్రీకారం చుట్టింది. నవంబర్ 3న నిర్వహించనున్న న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)కు సన్నద్ధమయ్యే దిశగా విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 23, 27, అక్టోబర్ 3, 27, 31, నవంబర్ 2వ తేదీల్లో వివిధ స్థాయిల్లో అభ్యసన సాధన పరీక్షలను నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థులు తరగతుల వారీ అభ్యసన సాధనలో వెనుకబాటును అధిగమించేందుకు ఈసారి అనేక ప్రణాళికలను సిద్ధం చేసింది. అందులో భాగంగానే తొలిమెట్టు, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి తదితర కార్యక్రమాలను ప్రారంభించింది.

ఇప్పటికే రెండు పరీక్షలు..

సెప్టెంబర్ 23న తొలి పరీక్ష, 27న రెండో పరీక్ష నిర్వహించారు. ఈ సాధన పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నారు. రాష్ట్ర విద్యా సాధన సర్వే (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెట్ సర్వే) పేరిట ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అభ్యసన సాధన పరీక్షలకు షెడ్యూల్ ప్రకారం ప్రశ్నపత్రాలను ముద్రించి జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈసారి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అభ్యసన స్థాయిలపరంగా వెనకబడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే నవంబర్ 3న నిర్వహించనున్న న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేస్తుంది.

తరగతులు, సబ్జెక్టుల వారీగా ఇలా...

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో అభ్యసిస్తున్న 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, విజ్ఞాన శాస్త్రం, గణితం. 6, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు, గణితం సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం తదితర సబ్జెక్టులోని సామర్థ్యాలను పరీక్షిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 3, 6, 9 తరగతుల్లోని ప్రతీ విద్యార్థి ఈ పరీక్షలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా తరగతుల వారీగా సామర్థ్యాలకు అనుగుణంగా ప్రశ్నపత్రాలను డీసీ ఈబీ ద్వారా ముద్రిస్తున్నారు. బహుళైచ్ఛిక ప్రశ్నల విధానం ద్వారా 40 మార్కులకు ఈ ప్రశ్న పత్రాన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖకు నివేదిస్తారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

ప్రాథమిక	533
ప్రాథమికోన్నత	85
ఉన్నత	117
ఆదర్శ	01
కేజీబీవీలు	18
అర్బన్ రెసిడెన్షియల్	01

సర్వే పరీక్షల షెడ్యూల్ ఇలా..

1వ పరీక్ష	23-09-2023
2వ పరీక్ష	27-09-2023
3వ పరీక్ష	03-10-202
4వ పరీక్ష	27-10-2023
5వ పరీక్ష	31-10-2023
6వ పరీక్ష	02-11-2023
జాతీయ సాధన పరీక్ష	03-11-2023

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకే..

రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను 'న్యాస్' పరీక్షకు సిద్ధం చేయడంలో భాగంగా అన్ని పాఠశాలల్లోని 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సెప్టెంబర్ 23, 27వ తేదీల్లో పరీక్షలు నిర్వహించాం. షెడ్యూల్ ప్రకారం మిగతా పరీక్షలు కొనసాగుతాయి. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ పరీక్షలు తోడ్పడతాయి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

4న జిల్లాకు కేటీఆర్ రాక

- రూ.1,157 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్‌టౌన్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 4న జిల్లాలో పర్యటిస్తారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని వెల్లడించారు. కేటీఆర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం నిర్మల్ పట్టణంలోని మినీ ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

ప్రారంభించే అభివృద్ధి పనులివే..

- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.714 కోట్ల వ్యయంతో చేపట్టిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని (ప్యాకేజీ-27) ప్రారంభిస్తారు.
- మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ. 23.91 కోట్ల వ్యయంతో నిర్మల్ పట్టణంలో ఇంటింటికీ నల్లా నీటి సరఫరాను ప్రారంభిస్తారు.

శంకుస్థాపనలు...

- సోన్ మండలం పాత పోచంపాడ్ గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో నిర్మించే ఆయిల్‌పాం ఫ్యాక్టరీ.
- నిర్మల్ పట్టణంలోని తహసీల్ కార్యాలయ స్థలంలో 2.30 ఎకరాల విస్తీర్ణంలో రూ.10.15 కోట్ల వ్యయంతో నిర్మించే సమీకృత మార్కెట్.
- నిర్మల్ పట్టణంలో రూ.2 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించే దోబీ ఘాట్ పనులు.
- నిర్మల్ పట్టణంలో రూ.4 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే పలు అభివృద్ధి పనులు.
- అమృత్ పథకంలో భాగంగా రూ.62.50 కోట్లతో చేపట్టే పనులు.
- నిర్మల్ పట్టణంలో రూ.50 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో మౌలిక వసతుల కల్పన.
- మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఎఫ్‌పీవో ఏర్పాటుపై మామిడి రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి శ్యాంరావు

కడెం: మండలంలోని కల్లెడ, నవాబ్‌పేట్ గ్రామాల మామిడి రైతులకు ఎఫ్‌పీవో ఏర్పాటుపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి శ్యాంరావు రాథోడ్ అవగాహన కల్పించారు. రైతు ఉత్పత్తి సంఘంగా ఏర్పడితే రైతులకు కలిగే లాభాలు, ప్రభుత్వం అందించే రాయితీల గురించి వివరించారు. ఇందులో ఉద్యాన క్లస్టర్ అధికారి సాదుల మౌనిక, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి రాజేందర్‌రెడ్డి, సర్పంచులు లావణ్య, విజయ తదితరులు ఉన్నారు.

న్యూవెల్మల్‌లో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభి ఎర్రవోతు రాజేందర్

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారితో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ లైబ్రరీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటులో సర్పంచ్ అంకం గంగమణి, వీడీసీ సభ్యులు ఎంతో కృషి చేశారని తెలిపారు. గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలను సమకూరుస్తామన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ నాగయ్య, ఉపసర్పంచ్ స్వామి, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, సాగర్, రవి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవులను సంరక్షించుకోవాలి

భైంసాటౌన్: గోవులను సంరక్షించుకోవాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. పట్టణ శివారులోని టీఎస్ఎస్పీ రెండో బెటాలియన్ పక్కన గోశాలకు చెందిన స్థలంలో రూ.10 లక్షలతో నిర్మించే షెడ్డుకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో గోవుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. హిందు వాహిని తెలంగాణ ప్రాంత సంయోజక్ రాజు మాట్లాడుతూ గోవు అమ్మ వంటిదని, గోసంరక్షణకు పాటుపడాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు పటేల్, మోహన్‌రావుపటేల్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ బాబు, మాజీ చైర్మన్ కృష్ణ, సోలంకి భీంరావు, గోసంరక్షణ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన



నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించారు. ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి డీఎం హామీ ఇచ్చారు.

ప్రజలు ఇచ్చిన సూచనలు

- ఉదయం 08.15 నిమిషాలకు నిర్మల్ నుంచి –ఆదిలాబాద్ కు సింగిల్ స్టాప్ బస్సు నడపాలి.
- కందుకూరు బస్సును లింగసంద్రం వరకు పొడిగించాలి.
- సోమర్‌పేట్ బస్సును సమయానుసారం నడపాలి.
- నిర్మల్ నుంచి గొల్లమాడ మీదుగా భైంసా వరకు బస్సు నడపాలి.
- అబ్దుల్లాపూర్ బస్సును రాయపూర్ కాండ్లీ మీదుగ నడపాలి.
- సముందర్‌పల్లికి నైట్‌హాల్ట్ బస్సు వేయాలి.

సమాజపు ఆనవాళ్లు.. వయోవృద్ధులు



మన బతుకు వాళ్లు.. మన ఎదుగుదల వారి చలవ.. మనం నడిచే దారి వారు వేసిన బాట.. నేటి సమాజాన్ని మనకంటే ముందు సృష్టించిన వాళ్లే.. చరిత్రకు ప్రత్యక్ష సాక్షులు మన పెద్దలు, వయోవృద్ధులు, ప్రతి అంశంలోనూ వాళ్లకు ఒక అనుభవం.. ఆలోచన ఉంటుంది. గతాన్ని భవిష్యత్‌తో ముడివేస్తూ వర్తమానంతో జరిపే సంభాషణ వాళ్ల జీవితసారం. నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- వివరాలు 10లో

రక్తదాతలు.. ప్రాణప్రదాతలు



రక్తదానం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

రక్తదానం చేసిన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది..

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో శనివారం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది రక్తదాన చేశారు. అక్టోబర్ 01 బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 20మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్ సోమయ్య మాట్లాడారు. సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యువత అపోహలు వీడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రక్తనిధి ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, రక్తదాతలు శ్రీధర్, రవికుమార్, మధుకర్, సదాశివ, బండ దిలీప్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, మహేందర్, రాజేశం, కుమారస్వామి, రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినా పలు సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని సమయాల్లో బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తనిల్వలు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యూనో హెమటాలజీ ద్వారా 1975 అక్టోబర్ 01న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పలువురు రక్తదానం చేస్తూ ప్రాణప్రదాతలుగా మారుతున్న వారి అభిప్రాయాలతో కథనం...

- అత్యవసర సమయాల్లో అందని రక్తం
- పలువురు రక్తదాన శిబిరాలు ఏర్పాటుతో ముందుకు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో...

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆవరణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల నుంచి స్వచ్ఛందంగా రక్తాన్ని సేకరించి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని గర్భిణులకు, అత్యవసర పరిస్థితుల్లోని వారికి రక్తాన్ని అందిస్తున్నారు.

రోగులు కోలుకుంటే సంతృప్తి



పాతమంచిర్యాల: నేను 21 సార్లు రక్తదానం చేశాను. 10సార్లు ఉచితంగా ప్లేట్‌లెట్స్ దానం చేసి డెంగీ వ్యాధిగ్రస్తులను కాపాడాను. వృత్తిరీత్యా వ్యాపారం చేసుకుంటాను. రక్తం కావాలని ఫోన్ చేస్తే వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు సైతం వెళ్లి రక్తదానం చేశాను. తాను రక్తదానం చేసిన తర్వాత రోగులు కోలుకుని తనకు ఫోన్‌లు చేసి అభినందిస్తారు. దీంతో నాకు ఎంతో సంతృప్తి కలుగుతుంది.

– గుమాన ప్రమోద్, కాసిపేట

ఎనిమిదేళ్లుగా సేవలో



పాతమంచిర్యాల: ఎనిమిదేళ్ల క్రితం కొద్దిమంది మిత్రులతో కలిసి రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభించాను. రక్తం అవసరం ఉన్న వారికి సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరిస్తున్నాం. ఏ ఆస్పత్రిలో రోగికి అవసరం ఉందని సమాచారం వచ్చినా వెంటనే స్పందించి రక్తం అందించి రోగుల ప్రాణాలు కాపాడడానికి తమ వంతు సహకారం అందిస్తున్నాం. ఇప్పటి వరకు 1800 మందికి స్వచ్ఛందంగా రక్తం అందించాం.

– అబ్దుల్ రహీం. రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ, మంచిర్యాల

సంతృప్తి.. సంతోషం



ఆసిఫాబాద్: ఇప్పటి వరకు 33 సార్లు రక్తదానం చేశాను. ప్రతీ మూడు మాసాలకోసారి రక్తదానం చేస్తాను. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఇస్తుంటాను. మోవాడ్‌లో ఒక తలసేమియా పేషెంట్ కోసం వెంకటాపూర్ సర్పంచ్ ఫోన్ చేస్తాడు. దీంతో వెంటనే రక్తం ఇవ్వడం జరుగుతుంది. ఎవరికి ఆపద ఉన్న రక్తదానం చేస్తాను. రక్తదానంతో ప్రాణదానం చేసిన సంతృప్తితో పాటు సంతోషం లభిస్తుంది.

– వైరాగరే ప్రతాప్, ఆసిఫాబాద్

46సార్లు రక్తదానం...



రక్తదానం చేస్తున్న మధుసూదన్(ఫైల్)

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఫర్‌బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఇండియన్ రెండ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మధుసూదన్ ఇప్పటి వరకు 46సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రజల మన్ననలు పొందాడు. అరుదైన ఏబీ నెగెటివ్ గ్రూపు కలిగిన అతడు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తాన్ని అందించి పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్, కలెక్టర్‌లు ప్రశంసాపత్రాలు ఇచ్చి సన్మానించారు.

రోగులకు ఆసరాగా..



పాతమంచిర్యాల: ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేశాను. రహీం బ్లడ్‌డొనేషన్ వెల్ఫేర్ సొసైటీలో సభ్యులుగా ఉన్న తనకు ఎక్కడి నుంచి ఫోన్ వచ్చిన రాత్రిపగలు తేడా లేకుండా అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి రోగులకు ఆసరాగా నిలుస్తున్నాను.

– మహ్మద్ ముజాహిద్, మంచిర్యాల

రక్తదాతలను ప్రోత్సహిస్తా



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వ లేనప్పుడు నన్ను సంప్రదిస్తారు. అలాంటి సందర్భంలో వెంటనే రక్తదాతలను తీసుకొచ్చి రక్తదానం చేయిస్తాను. నేను కూడా ఆరు సార్లు రక్తదానం చేశాను. ఇప్పటి వరకు బ్లడ్ బ్యాంకులో సుమారు వెయ్యి యూనిట్లు రక్తం ఇప్పించాను. అవసరమున్న వారు సెల్ నెం.9573854347 సంప్రదించవచ్చు.

– మాడిశెట్టి ప్రశాంత్, సామాజిక కార్యకర్త

అపోహలు వీడి..



నిర్మల్ చైన్‌గేట్: రక్తదానం ప్రాణదానం వంటిది. ప్రతీఒక్కరు రక్తదానం చేయవచ్చు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. నేను ఇప్పటి వరకు 56సార్లు రక్తం ఇచ్చాను. అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలి.

– వేణుగోపాలకృష్ణ, జిల్లా ఆస్పత్రి వైద్యుడు

సంతృప్తినిస్తుంది



ఆదిలాబాద్: అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడంతో ఇతరుల ప్రాణాలను నిలబెట్టిన వారమవుతాం. ఇటువంటి సందర్భాల్లో ప్రతీఒక్కరు ముందుకు రావాలి. ఇప్పటివరకు నేను 32సార్లు రక్తదానం చేశాను. ఒక రాష్ట్రస్థాయి అవార్డు సైతం వచ్చింది. ఈ అవార్డులు రివార్డుల కన్నా రక్తదానం చేయడమే సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ అజీజ్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

ముందుకు రావాలి



ఆదిలాబాద్: జిల్లాలో ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. అటువంటివారు సరైన సమయంలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేశాను. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజున పురస్కారం సైతం తీసుకున్నాను.

– ఉత్తర్‌వార్ గణేష్, ఆదిలాబాద్

ఎవరికి అవసరం ఉన్నా..



కౌటాల: రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. ఇప్పటి వరకు నేను పది సార్లు రక్తదానం చేశాను. అత్యవసరంలో ఉన్న వారికి రక్తదానం చేసినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. నా బ్లడ్ గ్రూప్ ఎ పాజిటివ్. ఎవరికి అవసరం ఉన్న రక్తదానం చేయడంలో నేను ముందుంటాను.

– బాలజీ, గుడ్లబోరి, కౌటాల

ప్రాణాలు దక్కుతాయి



కౌటాల: రక్తదానం చేస్తేనే రక్తం అవసరం ఉన్నవారి ప్రాణాలు దక్కుతాయి. నేను ఇప్పటి వరకు ఐదు సార్లు రక్తదానం చేశాను. ఆసుపత్రిలో చాలా మంది నిరుపేద రోగులు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని సోషల్ మీడియాలో వస్తే వెళ్లి రక్తదానం చేసి వస్తాను. నావంతుగా అవసరం ఉన్నవారికి రక్తదానం చేస్తున్నాను.

– మోర్లె పాండురంగ్, కన్నెపల్లి, కౌటాల

క్లుప్తంగా

డిక్లరేషన్ సదస్సు విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: అక్టోబర్ 1 ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల డిక్లరేషన్ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు హలో ఉద్యమకారుడా... చలో హైదరాబాద్ పేరిట ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

3న ఇందూరు జనగర్జన సభ


- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇందూరు జన గర్జన సభ విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్మల్ జిల్లా కోర్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ఇందూరు జన గర్జన సభను విజయవంతం చేసేందుకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, బీజేపీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 50వేలకు పైగా జన సమీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రవి పాండే, రామారావు పటేల్, నారాయణ్ రెడ్డి, సామ రాజేశ్వర్ రెడ్డి, మెడిసెమ్మ రాజు, అంజుకుమార్ రెడ్డి, ముత్యం రెడ్డి, జానుబాయి, రాజశేఖర్, సుమన్ పాల్గొన్నారు.

కడెంకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



15వ నంబర్ గేటు నుంచి వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్టుకు శనివారం 4282 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కౌంటర్ వెయిట్ విరిగి దెబ్బతిన్న 15 నంబర్ గేటు మరమ్మతులు కొనసాగుతున్నాయని, హైడ్రాలిక్ జాకీలు పనిచేయకపోవడంతో చైన్ పుల్లింగ్ ద్వారా గేటును కిందకు దించేందుకు మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 699.375 అడుగుల నీటి మట్టం ఉంది.

భైరందేవ్ విగ్రహానికి మహాభిషేకం

- ఈ నెల 27న కనిపించిన భైరందేవ్ విగ్రహ నిజరూపం
- మహాభిషేకానికి బారులు తీరిన భక్తులు



మహాపూజకు వస్తున్న ఆదివాసీలు

బేల: మండలంలోని శాతవాహనుల కాలం నాటి సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని ఆదివాసీల ఆరాధ్య దైవమైన భైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో శనివారం స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 27న భైరందేవ్ ఆలయంలో భైరందేవ్ విగ్రహం పైభాగపు చంద్రం తొలగిపోయి (తరతరాలుగా ఎవరు చూడని) భైరందేవ్ నిజరూపం దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక శోబాయాత్ర నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో భైరందేవ్ విగ్రహానికి గంగ జలంతో ప్రత్యేక మహాభిషేకం నిర్వహించారు. భక్తులు దర్శనానికి బారులు తీరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ఉపాధ్యక్షుడు సిడాం కుషాల్‌రావు, సర్పంచ్‌లు కొరంగే జంగ్‌షా, ఆడ శంకర్, ఆదివాసి నాయకులు పెందుర్ రాందాస్, కొరంగే దౌలత్ పటేల్, మేస్రం వాసుదేవ్, ఫక్రు పాల్గొన్నారు.

అన్నదాడిలో తమ్ముడి మృతి



చిన్న మల్లయ్య మృతదేహం

లక్ష్మణచాంద: అన్నదాడిలో తమ్ముడు మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని మల్లాపూర్ గ్రామంకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు సిలారి పెద్ద మల్లయ్య, సిలారి చిన్న మల్లయ్య (45) ఇద్దరు పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరి మధ్య ఎనిమిదేళ్లుగా భూ వివాదం నెలకొంది. శుక్రవారం ఉదయం ఇరు కుటుంబల మధ్య ఇంటి వాకిలి విషయంలో గొడవ మొదలైంది. సిలారి పెద్ద మల్లయ్య, అతడి కొడుకు సిలారి మహేశ్‌లు కలిసి సిలారి చిన్న మల్లయ్యను కత్తితో దాడిచేశారు. దీంతో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చిన్న మల్లయ్యను చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చిన్న మల్లయ్య శనివారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

విధులను ఆటంకపర్చిన భార్యాభర్తలపై కేసు

కడెం: పోలీసుల విధులను ఆటంకపర్చిన మండలంలోని పెద్దబెల్లాల్ జీపీ పరిధిలోని మొర్రిగూడేం గ్రామానికి చెందిన వెల్పుల తిరుపతి, అతడి భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొసన రాజు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... ఈ నెల 29న సాయంత్రం మండలంలోని బెల్లాల్ ఎక్స్ రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోతో వచ్చిన తిరుపతి మద్యం తాగడంతో పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేసేందుకు ప్రయత్నించగా నిరాకరించాడు. దీంతో తిరుపతిని రక్త నమూనాల సేకరణ కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో పోలీసుల విధులను ఆటంకపరుస్తూ సిబ్బందిపై దాడి చేశాడు. ఆటోలో తిరుపతితో పాటు ఉన్న భార్య జ్యోతి సైతం పోలీసులను అసభ్యపదజాలంతో దూషించినట్లు తెలిపారు. తిరుపతి, అతడి భార్యపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాముకాటుతో రైతు మృతి



లక్ష్మణ్‌రావు (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని కాండ్లీ గ్రామపంచాయతీ పరిధిలోని మోహాడ గ్రామానికి చెందిన సిడం లక్ష్మణరావు(45) పాముకాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిడం లక్ష్మణరావు శుక్రవారం సాయంత్రం చేను నుంచి ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో దారిలో పాము కాటు వేసింది. వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చేపల వేటకెళ్లి మత్స్యకారుడు మృతి



చిన్న సాదు(ఫైల్)

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన తోకల చిన్న సాదు(44) మత్స్యకారుడు చేపటల వేటకెళ్లి చెరువులో పడి మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... తోకల చిన్నసాదు ఎప్పటి మాదిరిగానే లోకేశ్వరం భగీరథ చెరువులోకి శనివారం చేపల వేటకు వెళ్లాడు. చెరువులో తెప్ప నుంచి వల వేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి నీటమునిగి మృతిచెందాడు. సాదుకు భార్య ఇంద్ర, ముగ్గురు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిపై కుక్క దాడి

బోథ్: మండలంలోని సొకెర గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడు ధీరజ్‌పై కుక్కదాడి ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ధీరజ్ ఇంటి వద్ద ఆడుతూ ఉండగా ఒక్కసారిగా బాలుడిపై కుక్క దాడి చేసింది. కుటుంబీకులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అందించి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నాడు.

హామీ మేరకు పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న మాధురి రాజన్ క్షీరాసాగర్

ఎదులాపురం: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాధురి రాజన్ క్షీరాసాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో శనివారం నిర్వహించిన పోరాట సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్‌లో ఉన్న 90 శాతం వాటాను మోది ప్రభుత్వం 60 శాతానికి కుదించి రాష్ట్రాలపై భారం మోపిందని అన్నారు. లక్ష్యం నెరవేరేదాక ఆందోళనలు ఆగవని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, అంగన్‌వాడీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కల్లూరి చందన, పద్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు దేవేందర్, గాజంగుల రాజు, జిల్లా కన్వీనర్ మేస్రం భాస్కర్ పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ సందర్శన



స్థానిక వైద్యులతో కేంద్ర బృందం సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) ఢిల్లీ కేంద్ర బృందం సభ్యులు శనివారం సందర్శించారు. కేంద్రం ప్రభుత్వం గర్భిణులకు, బీపీ, షుగర్, టీబీ, లెప్రొసీ, చిన్నారులు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వీటితో పాటు యోగాపై ఎలా అవగాహన కల్పిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఢిల్లీ బృందం అధికారులను శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ బృందంలో ఢిల్లీ బృందం అధికారులు డాక్టర్ కెకె దావన్, డాక్టర్ రాజేశ్వతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, మండల వైద్యాధికారి డాక్టర్ రాహుల్, సర్పంచ్ దొగ్గలి ప్రమీలా, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎంపీ ఎదుటే తగువులాట..!

- భైంసాలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో వాగ్వాదం
- కనిపించని జిల్లా అధ్యక్షురాలు రమాదేవి



వాగ్వాదానికి దిగిన నాయకులు

భైంసాటౌన్: భైంసా బీజేపీలో ఇప్పటికే అంతర్గత కలహాలు కలవరపెడుతుండగా, శనివారం పట్టణంలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎంపీ సోయం బాపురావు ఎదుటే స్థానిక నాయకులు తగువులాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. శనివారం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం విలేకరుల సమావేశం సందర్భంగా వేదికపై ఎంపీ సోయం, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్, రవిపాండే, నారాయణ్‌రెడ్డి, కౌన్సెలర్ అనిత సూత్రావేతో పాటు ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బాజీరావు కూర్చోగా అక్కడే ఉన్న అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, గాలి రవి తదితరులు బాజీరావును వారించారు. దీంతో ఎంపీ ఎదుటే వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాను ఓబీసీ నాయకుడినని ప్రొటోకాల్ ప్రకారం కూర్చుంటే తప్పేంటని బాజీరావు ప్రశ్నించగా, పార్టీ కోసం ఏ పని చేశావంటూ అతడిని నిలదీశారు. ఇంత జరుగుతున్నా ఎంపీ సోయం వారిని సముదాయించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

కనిపించని జిల్లా అధ్యక్షురాలు...

భైంసాలో పార్టీ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవంలో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి గైర్హాజరయ్యారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఆమెకు తెలియకుండానే హడావిడిగా చేశారని సమాచారం. ఈ కారణంగానే ఆమె ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎంపీ సోయం బాపురావును ప్రశ్నించగా ఈనెల 3న ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆమె బిజీగా ఉన్నారని, అందుకే కార్యక్రమానికి రాలేదని చెప్పడం విశేషం.

చెరువులో పడి యువకుడి మృతి



మల్లేష్(ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన జరి మల్లేష్(36) వ్యవసాయ కూలీ కొత్త చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందాడు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం తల్లి భోజవ్వ దగ్గర రూ.100 తీసుకొని గ్రామంలో జరుగుతున్న వినాయక శోభాయాత్రకు వెళ్లాడు. రాత్రి 9గంటల వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆలస్యంగా వస్తాడనుకొని కుటుంబ సభ్యులు పడుకున్నారు. శనివారం ఉదయం వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు. కొత్తచెరువు వద్ద చెప్పులు, దుస్తులు గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకుతీసుకొచ్చారు. మృతుడికి భార్యతో పాటు కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

ఆటోబోల్తా.. ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులను రిమ్స్‌కు తరలిస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... పనినిమిత్తం ఇంద్రవెల్లి నుంచి దన్నోర(బి) గ్రామానికి వెళ్తున్న ఆటో కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఆటో డ్రైవర్ సురేష్‌తో పాటు ప్రయాణికులు మిథున్, తారక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు.